
సాక్షి
సూర్యాపేట
బుధవారం । 18 । అక్టోబర్ । 2023



కామ్రేడ్లకు కంచుకోట
నకిరేకల్ నియోజకవర్గం సుదీర్ఘకాలం పాటు కమ్యూనిస్టులకు కంచు కోటగా ఉంది.
- 10లో



మంత్రులుగా మనోళ్ల రికార్డు..
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నేతలు రాష్ట్ర మంత్రులుగా వ్యవహరించారు.
- 10లో

ఈ -ఓటర్ కార్డు పొందొచ్చు
ఓటరు గుర్తింపు కార్డు లేని వారు ఈ-ఓటరు గుర్తింపు కార్డు ద్వారా ఓటు వేయొచ్చని ఎన్నికల సంఘం తెలిపింది.



- 10లో

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌ను ఎస్పీ రాహుల్ హెగ్డే మంగళవారం జిల్లా కోర్టు ప్రాగణంలోని న్యాయమూర్తి చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కేసుల దర్యాప్తు, నేరస్తులకు శిక్షల అమలు, పెండింగ్ కేసుల పరిష్కారంపై వారు చర్చించుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ నాగభూషణం, సీఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.

19న గీత పనివారల సంఘం వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న రేగటి లింగయ్య

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈ నెల 19న తెలంగాణ రాష్ట్ర గీత పనివారాల సంఘం వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగటి లింగయ్య తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1956లో దివంగత ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం గీత పనివారల సంఘాన్ని స్థాపించారని, నాటి నుంచి నేటి వరకు గీతకార్మికుల సమస్యలపై సంఘం పోరాడుతోందన్నారు. సంఘం వార్షికోత్సవాల సందర్భంగా అన్ని మండలాలు, పట్టణాల్లో జెండా ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ సమావేశంలో గీత పనివారల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, ప్రాంతీయ అధ్యక్షుడు బండారు లక్ష్మయ్య, నాయకులు బూర వెంకటేశ్వర్లు, బూర సైదులు పాల్గొన్నారు

బీఆర్‌ఎస్‌కు కేఎల్‌ఎన్ ప్రసాద్ రాజీనామా



కోదాడ: కోదాడకు చెందిన మాజీ కౌన్సిలర్, కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ మున్సిపల్ కౌన్సిలర్ల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్‌ఎన్ ప్రసాద్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. కొంత కాలంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌పై అసంతృప్తితో ఉన్న ప్రసాద్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీలో చేరిన సమయంలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పి పట్టించుకోకపోవడంతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర గౌడ సంఘంతో పాటు గౌడ సామాజిక వర్గంలో మంచి పట్టున్న ఆయన పార్టీ మారుతుండడం స్థానికంగా చర్చనీయాంశమైంది. రెండు రోజుల క్రితం నల్లగొండ ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. రెండు మూడు రోజుల్లో భారీ ఎత్తున తన అనుచరులతో కలిసి ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

ఎడమకాల్వకు నీటి నిలిపివేత

నాగార్జునాసాగర్ : నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు మంగళవారం సాయంత్రం నీటిని నిలిపివేశారు. ఆయకట్టులో వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి బావులు, బోర్ల కింద వేసిన వరి చేలు చేతికొచ్చే దశలో ఎండిపోతుండడంతో రైతుల డిమాండ్ మేరకు గత పది రోజులుగా ఎడమ కాల్వకు నీటిని విడుదల చేశారు. రోజుకు 5000 క్యూసెక్కుల చొప్పున ఐదు టీఎంసీలు వదిలారు. ప్రభుత్వం చెప్పిన కోటా ముగియడంతో నీటిని నిలిపివేశారు.

బయటికొచ్చిన అసమ్మతి

బీఆర్‌ఎస్‌లో తీవ్రమైన అసంతృప్తి స్వరం

- నల్లగొండ, కోదాడలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వలసలు
- సూర్యాపేట, నల్లగొండలో ఇతర పార్టీల్లోకి 'గులాబీ' అసమ్మతి నేతలు
- మిర్యాలగూడ, మునుగోడులో పొత్తుల రచ్చ
- మిర్యాలగూడలో 'సేవ్ కాంగ్రెస్' పేరుతో ఆందోళన
- మునుగోడులో ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేస్తామంటున్న సీపీఐ



ఉత్తమ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి, చిత్రంలో ఎర్నేనిబాబు తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ప్రధాన రాజకీయ పార్టీల్లో అసంతృప్త నేతలు బయటకు వస్తున్నారు. టికెట్ ఆశించిన వారు, సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసంతృప్తితో ఉన్న వారు ఆయా పార్టీలను వీడుతున్నారు. కొందరు ఇతర పార్టీల్లో చేరి పోటీలో దిగేందుకు సిద్ధం కాగా, మరికొందరు ఉన్న పార్టీ నుంచి మరో పార్టీలో చేరుతున్నారు. ఎన్నికల ప్రచారం మొదలు కావడంతో వలసలు జోరందుకున్నాయి. నల్లగొండ, కోదాడలలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వలసలు మొదలు కాగా, సూర్యాపేట, నల్లగొండలో అసమ్మతి నేతలు ఇతర పార్టీల్లోకి వెళ్లారు. మిర్యాలగూడ, మునుగోడులో పొత్తుల రచ్చ సాగుతూనే ఉంది. మిర్యాలగూడలో 'సేవ్ కాంగ్రెస్' పేరుతో ఆందోళనకు దిగగా, మునుగోడులో ఫ్రెండ్లీ కాంటెస్ట్ చేద్దామంటూ సీపీఐ కొత్త ప్రతిపాదనతో ముందుకు వచ్చింది.

● నల్లగొండ బీఆర్‌ఎస్‌కు షాక్

నల్లగొండ నియోజకవర్గంలో రెండు రోజుల కిందట కాంగ్రెస్ పార్టీకి చెందిన నల్లగొండ ఎంపీపీ మనిమద్దె సుమన్‌ను అధికార పార్టీలో చేర్చుకొని కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇవ్వగా.. కాంగ్రెస్ పార్టీ మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌తోపాటు మరో ఐదుగురు కౌన్సిలర్లు ప్రదీప్ నాయక్, సందీప్, భాస్కర్, ఖయ్యూమ్ బేగ్, అసిమా సుల్తానా భర్త బషీర్, తిప్పర్తి మండలం జంగారెడ్డి గూడెం ఎంపిటిసి ముత్తినేని అనుషా భర్త నాగేశ్వర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటికే తిరుగుబాటు జెండా ఎగురవేసిన గులాబీ పార్టీ నుంచి సస్పెండ్ అయిన బీఆర్‌ఎస్ పట్టణ మాజీ అధ్యక్షుడు, కౌన్సిలర్‌పిల్లి రామరాజు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీచేస్తున్నట్లు ప్రకటించారు.

● నాగార్జునసాగర్‌లోనూ వలసలు

నాగార్జునసాగర్ బీఆర్‌ఎస్‌లోనూ అసమ్మతి కొనసాగుతోంది. ఎమ్మెల్యే నోముల భగత్‌పై అసంతృప్తితో హాలియా మున్సిపాలిటీకి చెందిన టీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నేత, ఎడమకాలువ మాజీ వైస్ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి సోమవారం మాజీ మంత్రి జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తిరుమలగిరి సాగర్ గ్రామ సర్పంచ్ శ్రవణ్ కుమార్ రెడ్డి, నిడమనూరు మండల రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు అంకతి వెంకటరమణతోపాటు పలు గ్రామాల కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. పెద్దవూర మండలంలో టీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు కొట్టి రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం గుర్రంపోడు మండలంలోని జెడ్పీటీసీ సభ్యురాలు గాలి సరిత భర్త గాలి రవికుమార్‌తో పాటు పది గ్రామాల సర్పంచులు కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ప్రధాన అనుచరుడు మన్నెం రంజిత్ యాదవ్ బీజేపీలో చేరారు.

● సూర్యాపేట బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లో వర్గ పోరు

సూర్యాపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌లో అసమ్మతి తప్పలేదు. కొంత కాలంగా మంత్రి జగదీశ్‌రెడ్డికి వ్యతరేకంగా వ్యవహరిస్తున్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జానయ్య యాదవ్ బీఎస్పీలో చేరారు. సోమవారం సూర్యాపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన భార్య, కౌన్సెలర్ రేణుక, మరో కౌన్సిలర్ నీలబాయి కూడా బీఎస్పీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి మధ్య ఇంకా సయోధ్య కుదరలేదు. దీంతో ఇక్కడ కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోయింది.

● నకిరేకల్‌లోనూ మొదలైన అసంతృప్తి

నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరికతో అసంతృప్తికి గురైన కాంగ్రెస్ పార్టీకి చెందిన చిట్యాల మున్సిపల్ కౌన్సిలర్లు ఇద్దరు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కలిసి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా, మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మూడు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఒక ఎంపీటీసీ, ఇద్దరు సింగిల్ విండో డైరెక్టర్లు తోపాటు పలువురు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు వేముల వీరేశం ఆధ్వర్యంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు.



నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు

● నివురుగప్పిన నిప్పులా..

మునుగోడు నియోజకవర్గంలో అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా మునుగోడు జెడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణి భర్త నారబోయిన రవిముదిరాజ్ ఇటీవల నల్లగొండ, చండూరు ప్రాంతాల్లో తమ సామాజిక వర్గం ఓటర్లతో సమావేశాలు నిర్వహించారు. టికెట్ ముదిరాజ్‌లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తులో భాగంగా ఇక్కడ తమకు టికెట్ ఇవ్వాలని సీపీఐ పట్టుపడుతోంది. అందుకు కాంగ్రెస్ ససేమిరా అంటోంది. అక్కడి నుంచి సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం టికెట్ ఆశిస్తున్నారు. కాంగ్రెస్ ఈ స్థానాన్ని తమకు కేటాయించకపోతే ఫ్రెండ్లీ కంటెస్ట్ చేస్తామని సీపీఐ కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది.

● మిర్యాలగూడలో పొత్తు రేపిన చిచ్చు..

మిర్యాలగూడ టికెట్‌ను పొత్తులో భాగంగా సీపీఎంకు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. దీంతో అక్కడి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళలో పడ్డాయి. ముఖ్యంగా అక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న బత్తుల లక్ష్మారెడ్డి సేవ్ కాంగ్రెస్ పేరుతో పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. దామరచర్ల మండలం రాళ్లవాగుతండా నుంచి మంగళవారం పాదయాత్ర నిర్వహించారు.

● అసమ్మతి సద్దు మణిగిందా?

దేవరకొండలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అభ్యర్థిత్వాన్ని బహిరంగంగానే స్థానిక నేతలు వ్యతిరేకించారు. బీఆర్‌ఎస్ అధిష్టానం వరకు వెళ్లారు. ప్రస్తుతం అంతా మిన్నకుండిపోయారు. ఇక కాంగ్రెస్‌లో బాలునాయక్, వడ్త్యా రమేష్‌నాయక్, కిషన్ నాయక్ టికెట్ ఆశిస్తున్నారు. అక్కడ ఎవరికి ఇస్తారనేది ఇంకా తేలకపోవడంతో.. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

● కాంగ్రెస్ గూటికి అసంతృప్త నేతలు

కోదాడ నియోజకవర్గంలో మంగళవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. బీఆర్‌ఎస్ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ కన్మంత్‌రెడ్డి శశిధర్‌రెడ్డి ఇంటికి ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల ఎంపీపీలు ఆశా శ్రీకాంత్ రెడ్డి, చుండూరు వెంకటేశ్వరరావు, బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ సభ్యులు పుల్లారావు, ఉమా శ్రీనివాస్, బొలిశెట్టి శిరీష నాగేంద్రబాబు, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని బాబు, నలుగురు కౌన్సిలర్లు, పలువురు సర్పంచులు ఉత్తమ్‌కుమార్ రెడ్డితో చర్చలు జరిపారు. మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు ఇంటికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెళ్లారు. ఆయన నివాసంలో సమావేశమయ్యారు. చందర్‌రావును కూడా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు ఉన్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌పై వ్యతిరేకతతోనే వారు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వలసలు మొదలయ్యాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, కౌన్సిలర్లు భవాని, సతీష్, గాయత్రి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో ఎస్పీ

తుంగతుర్తి: అసెంబ్లీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ వెంకట్రావు సూచించారు. మంగళవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ మండలాల ఎన్నికల నిర్వహణ అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధుల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని సూచించారు. ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేలా ఈవీఎంలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27, 28 తేదీల్లో పోలింగ్ ఆపరేటర్లకు మొదటి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాజకీయ నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే డీఎస్పీ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే మాట్లాడుతూ నియోజకవర్గంలో 33 అత్యంత సమస్యాత్మక, 65 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు న్నాయన్నారు. నియోజకవర్గంలో 9 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఆర్డీఓ వీరబ్రహ్మాచారి, డీఎస్పీలు నాగభూషణం, రవి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బంది ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ట్రెజరీ స్టాంగ్ రూమ్, ఎన్నికల విభాగం, మీడియా సెంటర్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టుబడిన నగదు, వస్తువులను ట్రెజరీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామన్నారు. పట్టుబడిన డబ్బు, వస్తువులపై జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ కమిటీ సదరు బాధ్యుల ఆధారాలను పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీఓ అనిల్ కుమార్, డీపీఆర్‌ఓ రమేష్ కుమార్, ఏఓ సుదర్శన్ రెడ్డి, డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని అడ్డుకుంటాం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, చిత్రంలో నాగార్జున్‌రెడ్డి తదితరులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభం

సూర్యాపేట : మతోన్మాద బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకునేది కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద చర్యలకు పాల్పడుతూ మేధావులు, జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలను అంతం చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మహిళా బిల్లును వెంటనే ఆమోదింప జేయాలని డిమాండ్ చేశారు. దేశంలో కులగనణ చేపట్టాలని అన్ని పార్టీలు కోరుతుంటే బీజేపీ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన పాత హామీలకే గతి లేదు కానీ కొత్త హామీలు ఇవ్వడంలో అర్థం లేదన్నారు. రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ ప్రకటనలు అవకాశవాదంగా ఉన్నాయన్నారు. 2024 ఎన్నికల్లో ఎటువైపు ఉంటారో చెప్పకుండా గెలిచే పార్టీకే మద్దతు ఇస్తామని చెప్పడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ బీజేపీతో లోపాయికారి ఒప్పందంలో భాగంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీతో చర్చలు జరుగుతున్నాయని త్వరలో సీట్ల సర్దుబాటు ఉంటుందన్నారు. ఆ తర్వాత పోటీ చేసే అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా మతం - మతోన్మాదం అనే అంశంపై రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిటీ నాయకుడు బండారు రమేష్ బోధించారు. పార్టీ పతాకాన్ని సీపీఎం సీనియర్ నాయకుడు నాగిరెడ్డి శేఖర్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ప్రిన్సిపల్ గా వ్యవహరించిన ఈ శిక్షణ తరగతుల్లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాదివెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, పారేపల్లి శేఖర్ రావు, మట్టి పెళ్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి పాల్గొన్నారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి: రానున్న శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అనూహ్యమైన ఫలితాలు సాధించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పెదవీడు సర్పంచ్, మాజీ వైస్‌ఎంపీపీ సయ్యద్‌బీబీకుతుబ్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌డీ కుతుబ్, లిఫ్ట్ మాజీ చైర్మన్ సాముల భాస్కర్‌రెడ్డి, లాలితండా సర్పంచ్ బానోతు బోడీరమేష్‌నాయక్, ఉపసర్పంచ్ బాలునాయక్, పలువురు వార్డుసభ్యులు, మంచ్యాతండా మాజీ సర్పంచ్ కిషన్‌నాయక్, వరదాపురం సీనియర్ నాయకులు సుబ్బయ్యనాయుడు, వల్లబుదాసు సాయిలుగౌడ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు సేవలందించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమాలలో సాముల శివారెడ్డి, భూక్యామంజీనాయక్, వంటిపులి శ్రీను, కిషోర్‌రెడ్డి, సక్రునాయక్, కరీమ్, అరుణాసైదులు, గురువయ్య, సతీష్, ప్రభాకర్, ఎల్లారెడ్డి, హనుమా, ఎంఎంయాదవ్, సోములుగౌడ్, మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఆదిరెడ్డి, బి. బాబు, దుర్గయ్యగౌడ్, అప్పారావు, భీముడు, సక్రియా పాల్గొన్నారు.



మఠంపల్లి మండలం పెదవీడులో మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం

కోదాడ: కోదాడ డివిజన్ పోలీసులు అధికారపార్టీకి తొత్తులుగా మారారని, వారి తీరుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికార పార్టీ ఎమ్మెల్యే బీఫామ్ తీసుకొని కోదాడకు వస్తుంటే పోలీసులు ఎదురెళ్లి స్వాగతం పలకడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసు అధికారుల ట్రాన్స్‌ఫర్ విషయంలో లంచాలు తీసుకున్న చరిత్ర ఎమ్మెల్యేది అని ఆరోపించారు.

సదరం.. సుదూరం

- స్లాట్ల కోసం దివ్యాంగుల పాట్లు
- నిమిషాల వ్యవధిలో క్లోజ్ అవుతున్న స్లాట్లు
- నెలల తరబడి మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న వికలాంగులు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : దివ్యాంగులకు సదరం కష్టాలు తప్పడంలేదు. ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ పొందాలంటే వైద్యుడి ధ్రువీకరణ పత్రం అవసరం. దీనికోసం సదరం క్యాంపునకు వెళ్లాంటే ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి మీసేవ కేంద్రాల వద్దకు రావడం.. స్లాట్ బుక్‌కాక ఉసూరు మంటూ వెనుదిరగడం పరిపాటిగా మారింది. కొంత మంది ఇలా నెలల తరబడి తిరుగుతున్నా ప్రయోజనం ఉండడంలేదు.

నెలకు రెండు, మూడు క్యాంపులు

రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకంలో భాగంగా దివ్యాంగులకు నెలనెలా పింఛన్ ఇస్తోంది. జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో నెలలో రెండు, మూడు సార్లు నిర్వహించే సదరం శిబిరాల ద్వారా వికలాంగత్వాన్ని నిర్ధారించి ధ్రువీకరణ పత్రాలు అందిస్తారు. వీటి ఆధారంగా మండల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుని అర్హులైన దివ్యాంగులు పింఛన్ పొందుతున్నారు. గతంలో మండలం యూనిట్‌గా సదరం శిబిరాలు నిర్వహించి దివ్యాంగత్వ శాతాన్ని నిర్ధారించేవారు. నెలకో మండలం చొప్పున ఇవ్వడం తిరిగి వారి వంతు వచ్చేవరకు ఏడాదికి పైగా అవుతుండటంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ క్రమంలో జిల్లాను యూనిట్‌గా చేసి అన్ని రకాల దివ్యాంగులను కలిపి ప్రతి వారం 70 మంది చొప్పున.. నెలలో దాదాపు 210 మందికి వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దివ్యాంగులు సదరం స్లాట్ బుక్ చేసుకునేందుకు డీఆర్‌డీఏ ముందుగానే నిర్ణీత తేదీని ప్రకటిస్తోంది. సమీప మీసేవ కేంద్రాలకు వెళ్లి దివ్యాంగులు ఆ రోజున స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

జేబులకు చిల్లు

జిల్లాలోని కొందరు దళారులు దివ్యాంగుల దుస్థితిని ఆసరాగా చేసుకుని జేబులు నింపుకుంటున్నారు. కొన్నిచోట్ల స్లాట్ బుకింగ్ పేరిట రూ.1,000 నుంచి రూ.1,500 వరకూ తీసుకుంటున్నారు. నిజానికి దీని రుసుం రూ.45. పని అవుతుందనే ఆలోచనలతో దివ్యాంగులు నోరు మెదపడం లేదు.

ఇలా చేయొచ్చు..

గ్రామీణ ప్రాంతాల వారికి ప్రయోజనం కలిగేలా ప్రత్యేక సదరం శిబిరాలు ఏర్పాటు చేయటం ద్వారా ఈ సమస్యలను పరిష్కరించవచ్చు. స్లాట్ నమోదులో పల్లె, పట్టణాల వారికి కోటాలు నిర్ణయించడం ద్వారా సమస్యను తీర్చవచ్చు. లేదా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి అందే దరఖాస్తుల ఆధారంగా ప్రత్యేక స్లాట్‌లకు అవకాశం ఇచ్చి క్యాంపులు నిర్వహిస్తే సమస్య పరిష్కామవుతుంది.

వట్టె జానయ్యకు పదవీ గండం

- 32(1)ఎ ప్రకారం నోటీసులు ఇవ్వనున్న డీసీఓ
- పేట పీఏసీఎస్ పాలకవర్గం రద్దుతో డీసీఎంఎస్ ఛైర్మన్ పదవి పోయే చాన్స్

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా నాగార్జున సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వట్టె జానయ్య పదవి ఊడిపోనుంది. ఆయన సూర్యాపేట ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం చైర్మన్‌గా వ్యవహరిస్తూ 29 ఫిబ్రవరి 2020న డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. సూర్యాపేట పీఏసీఎస్‌లో సంవత్సరం కాలంలో రెండు సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా కేవలం ఒకే సమావేశాన్ని నిర్వహించారు. ఆరు నెలలు దాటినా మరో సమావేశం నిర్వహించ లేదు. ఈ కారణంగాపేట సహకార సంఘం పాలకవర్గాన్ని సూర్యాపేట జిల్లా సహకార అధికారి రద్దు చేశారు. 32(1)ఏ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్-1964 తెలంగాణ ప్రకారం సంవత్సర కాలంలో రెండు పాలకవర్గ సమావేశాలను నిర్వహించాలి. కానీ సూర్యాపేట సహకార సంఘంలో రెండు సమావేశాలు నిర్వహించకపోవడంతో పాలకవర్గాన్ని రద్దు చేసినట్లు డీసీఓ.. నల్ల గొండ జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్‌కు ప్రొసీడింగ్ పంపించారు. దీంతో జానయ్య ప్రాథమిక సహకార సంఘంలో పాలకవర్గ సభ్యుడిగా కొనసాగే హక్కు కోల్పోయినందున డీసీఎంఎస్ చైర్మన్ పదవినుంచి తప్పుకోవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన ప్రొసీజర్‌ను డీసీఓ కిరణ్‌కుమార్ ప్రారంభించే అవకాశం ఉంది. 32(1) ఏ చట్టం ప్రకారం డీసీఎంఎస్ చైర్మన్‌కు రెండు మూడు రోజుల్లో నోటీసు ఇవ్వనున్నట్లు నల్లగొండ డీసీఓ తెలిపారు.

మట్టపల్లిలో నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని అర్చకులు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ప్రత్యేక అర్చనలు, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మదుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అదేవిధంగా క్షేత్ర పాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో పూజలు చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సుదీర్ఘకాలం కామ్రేడ్లకు కంచుకోట



నకిరేకల్ పట్టణ వ్యూ

నకిరేకల్‌లో ఎనిమిది సార్లు గెలిచిన సీపీఎం

- ఆరుసార్లు విజయం సాధించిన నర్రా రాఘవరెడ్డి
- ప్రతిపక్ష నాయకులుగా తమ వాణి వినిపించిన నర్రా, నోముల
- 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో మారిన రాజకీయ సమీకరణలు

నకిరేకల్ : మినీ బెంగాల్‌గా పిలుచుకునే నకిరేకల్‌లో 14 సార్లు ఎన్నికలు జరిగితే పది సార్లు వామపక్షాల అభ్యర్థులు విజయం సాధించారు. ఇందులో సీపీఎం ఎనిమిది సార్లు గెలుపొందింది. ఇక్కడి నుంచి సీపీఎం తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన నర్రా రాఘవరెడ్డి, నోముల నర్సింహయ్యలు ప్రజా సమస్యలపై అసెంబ్లీతో తమ వాణి వినిపించారు. వీరి ప్రసంగాలతో పాలక పక్షాలను ఆలోచింపజేశారు. అయితే.. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో ఇక్కడ రాజకీయ సమీకరణాలు మారాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందగా.. 2014లో టీఆర్‌ఎస్, 2018లో కాంగ్రెస్ విజయం సాధించాయి.

సీపీఎం రికార్డు విజయాలు..

నియోజకవర్గంలో మొత్తం 14 సార్లు ఎన్నికలు జరిగితే సీపీఎం ఎనిమిది సార్లు గెలిచింది. ఇందులో నర్రా రాఘవరెడ్డి 1967–72, 1978–83, 1983–85, 1985–89, 1989–94, 1994–99 ఆరు సార్లు విజయం సాధించారు. 1972లో కాంగ్రెస్ అభ్యర్థి మూసపాటి కమలమ్మ నర్రా రాఘవరెడ్డిపై విజయం సాధించారు. ఆ తర్వాత 1977 నుంచి 2004 వరకు జరిగిన ఎన్నికల్లో వరసగా సీపీఎం విజయం సాధించి రికార్డు నెలకొల్పింది. 1999, 2004లో నోముల నర్సింహయ్య గెలిచి ఆ పార్టీ తరఫున శాసనసభాపక్ష నేతగా వ్యవహరించారు. ఆరుసార్లు గెలిసిన నర్రా రాఘవరెడ్డి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపించారు. ఏకకాలంలో నియోజకవర్గంలో 68 గ్రామాలకు విద్యుదీకరణ చేయించిన ఘనత నర్రా రాఘవరెడ్డికే దక్కింది. నల్లగొండ జిల్లా ఎడారిగా మారుతుందని ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం కోసం ఆనాడు ఎన్టీఆర్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రూపకల్పన చేయడంలో నర్రా కీలక భూమిక పోషించారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కమ్యూనిస్టులకు పట్టు ఉన్న శాలిగౌరారం మండలంతోపాటు తొప్పుచర్ల పిర్కా, తిప్పర్తి మండలంలోని కొన్ని గ్రామాలు తొలగించడం.. కాంగ్రెస్‌కు బలమున్న మండలాలు కలవడంతో పార్టీల బలాబలాలు మారిపోయి సీపీఎం వరస విజయాలకు అడ్డుకట్ట పడింది.

1957లో నియోజకవర్గం ఏర్పాటు

1957లో నకిరేకల్ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. ప్రస్తుతం ఇక్కడ 2,44,467 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,22,021 మంది, మహిళలు 1,22,442 మంది, ఇతరులు నలుగురు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో ప్రధాన వృత్తి వ్యవసాయం. కేతేపల్లి మండల సరిహద్దులో దాదాపు 40 వేల ఎకరాలకు పైనే సాగునీరు అందించే మూసీ ప్రాజెక్టు నిర్మితమై ఉంది. నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల్లో పరిశ్రమలు విస్తరించాయి. రామన్నపేట మండలం మినహా మిగతా ఐదు మండలాలు 65 నంబర్ జాతీయ రహదారిపైనే ఉన్నాయి. చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి మండల కేంద్రాల మీదుగా రైల్వే లైన్ కూడా ఉంది. నకిరేకల్ మీదుగా 65, 365, 565 నంబర్ల జాతీయ రహదారులు ఉన్నాయి.


బొమ్మగాని ధర్మభిక్షం


నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి


నర్రా రాఘవరెడ్డి


మూసపాటి కమలమ్మ


నోముల నర్సింహయ్య


చిరుమర్తి లింగయ్య


వేముల వీరేశం

ఇప్పటి వరకు నకిరేకల్ ఎమ్మెల్యేలు వీరే..

సంవత్సరం	గెలిచిన వారు	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1957	ధర్మభిక్షం	పీడీఎఫ్	కేవీ.రావు	కాంగ్రెస్
1962	నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి	సీపీఐ	కెఆర్.రెడ్డి	కాంగ్రెస్
1967	నర్రా రాఘవరెడ్డి	సీపీఎం	ఎం.కమలమ్మ	కాంగ్రెస్
1972	ఎం.కమలమ్మ	కాంగ్రెస్	నర్రా రాఘవరెడ్డి	సీపీఎం
1978	నర్రా రాఘవరెడ్డి	సీపీఎం	ముసరం నర్సయ్య	కాంగ్రెస్
1983	నర్రా రాఘవరెడ్డి	సీపీఎం	ఎస్.ఇంద్రసేనారెడ్డి	కాంగ్రెస్
1985	నర్రా రాఘవరెడ్డి	సీపీఎం	డి.వెంకటరాములు	కాంగ్రెస్
1989	నర్రా రాఘవరెడ్డి	సీపీఎం	జి.విద్యాసాగర్‌రెడ్డి	కాంగ్రెస్
1994	నర్రా రాఘవరెడ్డి	సీపీఎం	నేతి విద్యాసాగర్	స్వతంత్ర
1999	నోముల నర్సింహయ్య	సీపీఎం	కటికం సత్తయ్యగౌడ్	టీడీపీ
2004	నోముల నర్సింహయ్య	సీపీఎం	కటికం సత్తయ్యగౌడ్	టీడీపీ
2009	చిరుమర్తి లింగయ్య	కాంగ్రెస్	మామిడి సర్వయ్య	సీపీఎం
2014	వేముల వీరేశం	టీఆర్‌ఎస్	చిరుమర్తి లింగయ్య	కాంగ్రెస్
2018	చిరుమర్తి లింగయ్య	కాంగ్రెస్	వేముల వీరేశం	టీఆర్‌ఎస్

జంగ్ తెలంగాణ

ద్విసభ్య నియోజకవర్గాలు అంటే..

- 1952 తొలి ఎన్నికల్లో ఏర్పాటైన ద్విసభ్య నియోజకవర్గాలు
- 1957 ఎన్నికల్లోనూ కొనసాగింపు
- 1961 సంవత్సరంలో రద్దుచేసిన అప్పటి కేంద్ర ప్రభుత్వం
- ఎస్సీ, ఎస్టీలకు రిజర్వుడ్ స్థానాలు కేటాయింపు

కోదాడ: హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు 1952లో తొలిసారి ఎన్నికలు జరిగాయి. ఈ రాష్ట్రంలో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలోని కొన్ని భాగాలు కలిసి ఉండేవి. 1952 శాసన సభ ఎన్నికల్లో కొన్ని ఏక సభ్య నియోజకవర్గాలు, కొన్ని ద్వి సభ్య నియోజకవర్గాలు ఉండేవి. ఏక సభ్య నియోజకవర్గాల్లో ఒకస్థానంలో ఒక పార్టీ నుంచి ఒక్కరే పోటీ చేసే వీలుండేది. ద్విసభ్య నియోజకవర్గాల్లో ఒక స్థానంలో ఒక పార్టీ నుంచి ఇద్దరు పోటీ చేసేవారు. (అప్పటి వరకు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ స్థానాలు లేవు) దీనిలో ఒకరు జనరల్ సభ్యుడిగా.. రెండవ వారు రిజర్వు కేటగిరీకి చెందిన సభ్యుడు (ఎస్సీ లేదా ఎస్టీ) ఉండే వారు. ద్విసభ్య నియోజకవర్గం నుంచి ఇద్దరు గెలిచే వారు. వీరికి సమాన అధికారాలు ఉండేవి. కాకపోతే.. రిజర్వు సభ్యుడు తన నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీల సమస్యలు, హక్కుల గురించి చట్టసభల్లో ప్రస్తావించే వారు. ఈ ఎన్నికల సమయానికి హైదరాబాద్ రాష్ట్రంలో మొత్తం 142 శాసన సభ నియోజకవర్గాలు ఉండేవి. వీటిలో 33 ద్విసభ్య నియోజకవర్గాలు ఉండడంతో మొత్తం శాసనసభ్యుల సంఖ్య 175 ఉండేది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, హుజూర్‌నగర్, సూర్యాపేట నియోజకవర్గాలు ద్విసభ్య నియోజకవర్గాలుగా ఉండేవి. అయితే, ద్విసభ్య నియోజకవర్గాలకు ఎన్నిక ప్రక్రియ క్లిష్టంగా ఉండడంతో అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 1961 సంవత్సరంలో ద్విసభ్య నియోజకవర్గ విధానాన్ని రద్దు చేసి ఎస్టీ, ఎస్సీలకు ప్రత్యేక నియోజకవర్గాలను కేటాయించింది.

మాల్ చెక్‌పోస్టు పరిశీలన

చింతపల్లి : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో చింతపల్లి మండలంలోని మాల్ వెంకటేశ్వరనగర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ డ్యూటీ చేస్తున్న పోలీసులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో చెక్‌పోస్టు తీసుకుంటున్న చర్యలు, చేపడుతున్న వాహనాల తనిఖీలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్రమంగా మద్యం తరలించకుండా పకడ్బందీగా తనిఖీలు చేయాలని సిబ్బందికి సూచించారు. సరైన ఆధారాలు చూపని నగదును సీజ్ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, తహసీల్దార్ శంషొద్దీన్, ఎంపీడీఓ రాజు తదితరులున్నారు.

మంత్రులుగా మనోళ్ల రికార్డు

- 11 నియోజకవర్గాలకు అమాత్య యోగం
- మిర్యాలగూడకు దక్కని అవకాశం
- ఉమ్మడి రాష్ట్రంలో చక్రం తిప్పిన ఉద్ధండులు

ఉమ్మడి జిల్లాలో పలువురు నాయకులు వివిధ ముఖ్యమంత్రుల కాలంలో కీలక శాఖలకు మంత్రులుగా పనిచేశారు. వారు మంత్రులుగా రాష్ట్ర రాజకీయాల్లో తమదైన శైలితో చక్రం తిప్పారు. కుందూరు జానారెడ్డి లాంటి వారు మంత్రులుగా రికార్డు సృష్టిస్తే.. నెల రోజులు మంత్రి పదవులు చేసిన వారు.. ఎమ్మెల్సీగా గెలిచి మంత్రి పదవులు పొందినవారు.. తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవులను వదులుకున్న వారూ ఉన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పని చేసి మాజీ మంత్రులుగా నిలిచారు. ఉమ్మడి జిల్లాలో మంత్రులుగా పనిచేసిన వారు ఇలా..

– సాక్షి, యాదాద్రి

❖ కుందూరు జానారెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఎక్కువ సమయం మంత్రిగా పనిచేసిన రికార్డు జిల్లాకు చెందిన సీనియర్ నేత కుందూరు జానారెడ్డికి దక్కింది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జానారెడ్డి 1983–89 మధ్యకాలంలో ఎన్టీఆర్ మంత్రి వర్గంలో, 1992లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మంత్రి వర్గంలో, 2004, 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గాల్లో పనిచేశారు. హోంమంత్రిగా ఉన్నప్పుడు నక్సలైట్లతో చర్చల సమయంలో చాకచక్యంగా వ్యవహరించి అప్పట్లో అందరి ప్రశంసలందుకున్నారు.

❖ కొండా లక్ష్మణ్‌బాపూజీ

చిన్నకొండూరు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కొండా లక్ష్మణ్ బాపూజీ దామోదరం సంజీవయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గాల్లో మంత్రి పదవులు నిర్వహించారు. తొలి తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం కోరుతూ ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

❖ కొమ్ము పాపయ్య

రామన్నపేట నియోజకవర్గం నుంచి గెలిచిన కొమ్ము పాపయ్య ఒకసారి మంత్రిగా ఉన్నారు. టి.అంజయ్య మంత్రివర్గంలో పనిచేశారు.

❖ ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి


రామన్నపేట నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఉప్పునూతల జిల్లా రాజకీయాల్లో మకుటం లేని మహారాజుగా వెలుగొందారు. శాసనమండలి సభ్యుడిగా ఉన్నప్పుడు 1971లో కాసు బ్రహ్మానందరెడ్డి, 1973లో జలగం వెంగళరావు మంత్రివర్గాల్లో ఆయన పనిచేశారు.

❖ ఎలిమినేటి మాధవరెడ్డి

భువనగిరి నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగు సార్లు గెలిచిన ఎలిమినేటి మాధవరెడ్డి.. ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో పనిచేశారు. హోంమంత్రిగా ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రి వర్గాల్లో పనిచేసిన మాధవరెడ్డి.. చంద్రబాబు ప్రభుత్వంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉండగా నక్సలైట్ల మందుపాతరకు బలయ్యారు.

❖ గుత్తా మోహన్‌రెడ్డి

నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1978లో ఎమ్మెల్యేగా గెలుపొందిన గుత్తా మోహన్‌రెడ్డి మంత్రిగా పనిచేశారు.



❖ మోత్కుపల్లి నర్సింహులు

ఆలేరు నియోజకవర్గం నుంచి ఐదు సార్లు, తుంగతుర్తి నుంచి ఒకసారి గెలిచిన మోత్కుపల్లి నర్సింహులు జిల్లా రాజకీయల్లో తనదైన ముద్ర వేశారు. ఎన్టీఆర్ మంత్రి వర్గంలో గనులు భూగర్భ, సాంఘిక సంక్షేమ, విద్యుత్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రిగా పనిచేశారు.

❖ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంతో పాటు ఆయన మరణం తర్వాత రోశయ్య మంత్రివర్గంలో కూడా మంత్రిగా పనిచేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలోనూ మంత్రిగా పనిచేస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవికి రాజీనామా చేశారు.

❖ ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి

భర్త ఎలిమినేటి మాధవరెడ్డి దుర్మరణంతో రాజకీయల్లోకి వచ్చిన ఆయన భార్య ఉమామాధవరెడ్డి మూడు సార్లు భువనగిరి ఎమ్మెల్యేగా గెలిచారు. మాధవరెడ్డి మరణంతో జరిగిన ఉప ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆమెకు చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం లభించింది.

❖ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు. ప్రస్తుతం ఆయన నల్లగొండ ఎంపీగా ఉన్నారు.

❖ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి

మునుగోడు నియోజకవర్గం నుంచి ఐదు సార్లు గెలిచిన పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి మంత్రిగా పనిచేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో ఆయన గుండెపోటుతో చనిపోయారు.

❖ అక్కిరాజు వాసుదేవరావు

కోదాడ నియోజకవర్గం నుంచి గెలుపొందిన అక్కిరాజు వాసుదేవరావు కాసు బ్రహ్మానందరెడ్డి, పీవీ నర్సింహారావు మంత్రి వర్గాల్లో మంత్రిగా పనిచేశారు.

❖ డి.రవీంద్రనాయక్

దేవరకొండ నుంచి గెలుపొందిన రవీంద్రనాయక్ భవనం వెంకట్‌రాం మంత్రివర్గంలో పనిచేశారు.

❖ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

తుంగతుర్తి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి 1992లో నెదురుమల్లి జనార్దన్‌రెడ్డి, 2007లో వైఎస్సార్ మంత్రి వర్గంలో మంత్రిగా పనిచేశారు.

❖ జి. జగదీష్‌రెడ్డి

తెలంగాణ ఉద్యమ నేపథ్యంతో ఎదిగిన జి.జగదీశ్‌రెడ్డి 2014లో సూర్యాపేట ఎమ్మెల్యేగా తొలిసారి గెలిచారు. కేసీఆర్ తొలి మంత్రివర్గంలో ముందు విద్యాశాఖ మంత్రిగా, ఆ తర్వాత విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018 ఎన్నికల తర్వాత కూడా మొదట విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం విద్యుత్‌శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.



❖ వీరేపల్లి లక్ష్మీనారాయణ

కోదాడ ఎమ్మెల్యేగా పనిచేసిన లక్ష్మీనారాయణ ఎన్టీఆర్ ప్రభుత్వం పడదోసిన నాదెండ్ల భాస్కర్‌రావు ప్రభుత్వంలో నెలరోజుల పాటు మంత్రిగా పనిచేశారు. అతి తక్కువ కాలం పనిచేసిన వారిలో ఒకడిగా మిగిలిపోయారు.

ఫోన్ ద్వారా ఈ–ఓటర్ కార్డు పొందొచ్చు



భువనగిరిటౌన్: రాష్ట్రంలో నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే ఓటరు తుదిజాబితాను విడుదల చేశారు. ఓటరు దరఖాస్తుకు ఈనెల 30 వరకూ అవకాశం కల్పించారు. ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఓటరు కార్డు తప్పనిసరి. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి ఇప్పటికే ఇంటికి ఓటరు కార్డు పంపించారు. ఓటరు కార్డులేని వారి కోసం కేంద్ర ఎన్నికల సంఘం శుభవార్త చెప్పింది. ఓటరు గుర్తింపు కార్డులేని వారు ఈ ఓటరు గుర్తింపు కార్డు ద్వారా ఓటు వేయవచ్చని తెలిపింది. దీన్ని ఫోన్ ద్వారా కూడా సులభంగా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లో కీలక మార్పులు చేసింది. మొబైల్ నంబర్ సాయంతో క్షణాల్లోనే ఈ–ఓటరు గుర్తింపు కార్డు పొందవచ్చు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం రూపొందించిన ఫామ్ –8నే ఇందుకోసం ఉపయోగించాల్సి ఉంటుంది. అప్లికేషన్ ఫామ్‌లో మొబైల్ నంబర్ ఎంట్రీ చేసేందుకు ప్రత్యేకంగా ఓ కాలమ్ ఏర్పాటు చేశారు. దాన్ని క్లిక్ చేసిన తర్వాత సబ్‌మిట్ చేయాల్సి ఉంటుంది. https://voters.eci.gov.in వెబ్‌సైట్‌లో e-EPIC విభాగంలోకి వెళ్లి నిర్దేశించిన చోట ఓటరు గుర్తింపు కార్డు సంఖ్యను నమోదు చేయాలి. ఆ తర్వాత మనం ఏ మొబైల్ నంబర్ ఎంట్రీ చేశామో ఆ నంబర్‌కు వెంటనే ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేయగానే ఈ–ఓటర్ గుర్తింపు కార్డు డౌన్‌లోడ్ అవుతుంది. ఎన్నికల సంఘం పంపే ఓటరు గుర్తింపు కార్డు కోసం వేచి చూడకుండా.. ఈ–ఓటరు గుర్తింపు కార్డు ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఉపయోగపడుతుంది. గతంలోనూ ఈ సౌకర్యం ఉన్నప్పటికీ పొందుపర్చిన వివరాలు అసెంబ్లీ సెగ్మెంట్ ఎలక్షన్ ఆఫీసర్ ఆమోదించిన తర్వాత ప్రక్రియ పూర్తయ్యేది. కాగా.. ప్రస్తుతం ఈ ప్రాసెస్‌ను ఈజీ చేశారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు డౌన్‌లోడ్ చేసుకున్న ఈ– ఓటరు గుర్తింపు కార్డు చెల్లుబాటు అవుతుందని ఈసీ స్పష్టం చేసింది.

వ్యాపారంలో నష్టం.. ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


మల్లేష్ (ఫైల్)

డిండి: వ్యాపారంలో నష్టం రావడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరేసుకొని మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం డిండి మండల పరిధిలోని సింగరాజుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరాజుపల్లి గ్రామానికి చెందిన ఏటెల్లి మల్లేష్(25) హైదరాబాద్‌లో ఉంటూ కారు నడపడంతో పాటు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అతడు చేస్తున్న వ్యాపారంలో నష్టం వచ్చింది. దీంతో మూడు రోజుల క్రితం అతడు స్వగ్రామమైన సింగరాజుపల్లికి వచ్చాడు. మంగళవారం గ్రామ శివారులోని ఇతరుల వ్యవసాయ పొలంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటువైపుగా వెళ్తున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, చిన్న పాప ఉంది. కాగా ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

మద్యానికి బానిసై బలవన్మరణం

దేవరకొండ: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకొనిఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం దేవరకొండ మండల పరిధిలోని ఉచ్చరాలతండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉచ్చరాలతండాకు చెందిన జపుల హరి(31) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన హరి తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో హరి సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకన్నాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

పద్మారెడ్డికి రైతు నేస్తం పురస్కారం


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లోకసాని పద్మారెడ్డి

చందంపేట : మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన లోకసాని పద్మారెడ్డి వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి ఇచ్చే రైతు నేస్తం అవార్డును పొందారు. రైతునేస్తం 19వ వార్షికోత్సవం సందర్భంగా ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న స్వర్ణభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పద్మారెడ్డి మంగళవారం స్థానికంగా మాట్లాడారు. వ్యవసాయం అంటే చాలా ఇష్టమని, సేంద్రియ పద్ధతిలో దాదాపు 80ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలు, కుంకుడు తోటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. అవార్డు అందుకోవడం చాలా గర్వంగా ఉందని ఆయన అన్నారు.

మహిళను బెదిరించి బంగారు ఆభరణాలు చోరీ

కోదాడరూరల్: వాకింగ్‌కు వెళ్లిన మహిళను బెదిరించి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని రామ్మూర్తినగర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామ్మూర్తినగర్‌కు చెందిన జుట్టుకొండ రాధారాణి మంగళవారం ఉదయం తమ కాలనీ సమీపంలోని శ్రీసూర్య వైపు వాకింగ్‌కు వెళ్లింది. అదే సమయంలో బైక్‌పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమెను కిందకు నెట్టేసి ఆమె మెడలోని 8 తులాల పుస్తెలతాడుతో పాటు గాజులు, రింగు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాము తెలిపారు.

ఇద్దరు పిల్లలతో సహా వివాహిత అదృశ్యం

హుజూర్‌నగర్: పట్టణానికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ జహంగీర్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన జి.నాగరాజు, మనీషా 11ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కుమారుడు రాహుల్, కుమార్తె ఊర్మిళ ఉన్నారు. సోమవారం ఉదయం నాగరాజు పనికి వెళ్లగా.. మధ్యాహ్నం సమయంలో మనీషా భర్తకు ఫోన్ చేసి కోదాడ మండలంలోని కొమరబండలో ఉంటున్న తన అక్క వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. కానీ మనీషా కొమరబండ చేరుకోలేదని, తిరిగి ఇంటికీ రాలేదని భర్త నాగరాజు మంగళవారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి


యశ్వంత్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

భూదాన్‌పోచంపల్లి: చెరువులో ఈతకు వెళ్లి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని మెహర్‌నగర్ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మండలంలోని అంతమ్మగూడెం గ్రామానికి చెందిన బండారి ఈశ్వరయ్య, లలిత దంపతులకు యశ్వంత్(12), కుమార్తె ఉన్నారు. ఈశ్వరయ్య, లలిత దంపతులు స్థానికంగా ఓ రసాయన కంపెనీలో పనిచేస్తున్నారు. యశ్వంత్ చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలోని ప్రగతి స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 13 నుంచి స్కూళ్లకు దసరా సెలవులు ఇవ్వడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. తల్లిదండ్రులిద్దరూ మంగళవారం ఉదయం రసాయన కంపెనీలో పనికి వెళ్లగా.. యశ్వంత్ తన స్నేహితుడైన వస్పరి జశ్వంత్‌తో కలిసి మధ్యాహ్నం సమయంలో ఈత కొట్టేందుకు సైకిల్‌పై మెహర్‌నగర్ శివారులో ఉన్న సిద్దప్ప చెరువు వద్దకు వెళ్లారు. ఇద్దరు ఒడ్డున బట్టలు, చెప్పులు విడిచి చెరువులోకి దిగారు. కాగా యశ్వంత్ చెరువు ఒడ్డు నుంచి కొద్దిదూరం వెళ్లగానే అక్కడ పెద్ద గుంతలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న వస్పరి జశ్వంత్ భయపడి ఊర్లోకి వెళ్లి యశ్వంత్ ఇంటి వద్ద సైకిల్ పెట్టి ఏమీ తెలియనట్లు అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

దుస్తులను చూసి గుర్తించి..

కాగా ఇంటికి వచ్చిన యశ్వంత్ తల్లిదండ్రులు కొడుకు కనిపించకపోయేసరికి ఊరిలో వెదికారు. ఇరుగుపొరుగు వారిని కుమారుడి గురించి వాకబు చేశారు. మధ్యాహ్నం సమయంలో యశ్వంత్, జశ్వంత్ కలిసి చెరువు వైపు వెళ్లడం చూశానని గొర్రెల కాపరి వస్పరి పార్వతమ్మ చెప్పడంతో గ్రామస్తులతో కలిసి చెరువు వద్దకు వెళ్లి చూడగా ఒడ్డున యశ్వంత్ దుస్తులు, చెప్పులు కన్పించాయి. చెరువులోకి దిగి వెతకగా యశ్వంత్ మృతదేహం లభ్యమైంది. వెంటనే బయటికి తీశారు. ఈ విషయం తెలుసుకొన్న చౌటుప్పల్ రూరల్ సీఐ మహేశ్, స్థానిక ఎస్‌ఐ విక్రంరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పత్తి సాగుపై అవగాహన కలిగి ఉండాలి


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఉషారాణి

ఆత్మకూర్(ఎస్) (సూర్యాపేట) : అధిక సాంద్రతలో పత్తి సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఐసీఏఆర్ అండ్ సీఐసీఆర్ కోయంబత్తూరు శాస్త్రవేత్త ఉషారాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడంతో జాతీయ ఆహార భద్రత మిషన్ నుంచి విత్తనాలు, మొక్క శాఖీయ పెరుగుదలను నివారించడానికి వాడే మెపిక్వాట్‌క్లోరైడ్, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి అయ్యే ఖర్చు సుమారు ఎకరానికి రూ.6వేల చొప్పున నేరుగా రైతు ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగ శాస్త్రవేత్త డి.నరేష్, మండల వ్యవసాయ అధికారి దివ్య, వ్యవసాయ విస్తరణ అధికారి శైలజ, సూర్యప్రకాష్, కృషి విజ్ఞాన కేంద్రం యంగ్ ప్రొఫెషినల్స్ విక్రమ్, సంతోష్, మౌనిక, రైతులు పాల్గొన్నారు.